క్లుప్తంగా

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ములకలపల్లి: వలస ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు మడకం రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లి సాయిబాబా గుడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చి జీవనం సాగిస్తున్న వలస ఆదివాసీల సమస్య పరిష్కారంలో పాలకపక్షాలు తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వాపోయారు. ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని అన్నారు. పలు సమస్యలపై తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలపరిధిలోని 22 గుత్తికోయ గుంపులకు చెందిన వలస ఆదివాసీలు పాల్గొన్నారు. 22 గుత్తికోయ గుంపులకు చెందిన మడకం సంతోశ్, మడివి వీరేశ్, ముఖేశ్, పొడియం లక్ష్మణ్, పొడియం దినేశ్, సోడె సుక్కయ్య, మడివి లక్ష్మణ్, మడివి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులకు కన్నీటి వీడ్కోలు

అశ్వాపురం: మండల కేంద్రంలో తురుముల గూడెం గ్రామానికి చెందిన రైతు గుగులోతు శ్రీను రెండు ఎద్దులు మంగళవారం రాత్రి పిడుగుపాటుకు మృతి చెందాయి. తమ వ్యవసాయానికి సహకరిస్తూ జీవితంలో ఒక భాగమైన ఎద్దులు మృతి చెందడం శ్రీను కుటుంబాన్ని కలచివేసింది. ఆ కుటుంబ కన్నీటి పర్యంతమైం. శ్రీను కుటుంబసభ్యులకు బుధవారం ట్రాక్టర్‌లో ఎద్దులపై కుంకుమ, పూలు చల్లుతూ అంత్యక్రియలు నిర్వహించి వాటిపై తమకు ఉన్న ప్రేమను చూపించారు.

కౌలు చెల్లించాలి

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ భూములు సాగు చేసుకుంటున్నా రైతులు ఆలయానికి సక్రమంగా కౌలు చెల్లించాలని జిల్లా దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సులోచన కోరారు. బుధవారం ఆలయం ప్రాంగణంలో ఆలయ భూములు సాగుచేస్తున్న కౌలుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. బకాయిలు ఉన్న రైతులు పూర్తి బకాయిలు చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని, కౌలు సాగుదారుల సమస్యలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరారు. అనంతరం ఆలయ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ,వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, కౌలు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరకగూడెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలకమ్మతోగు గ్రామానికి చెందిన ఏడుళ్ల సత్యనారాయణ మండల పరిధిలోని వీరాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై ఓ పని నిమిత్తం వెళ్లాడు.అక్కడ పని ముగించుకొని సమీపంలో ఉన్న రేగళ్ల గ్రామానికి వెళ్తున్న క్రమంలో మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడింది. గాయాలు కాగా.. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని కరకగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

చండ్రుగొండ: నూతన జాతీయ విద్యా విధానంపై మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక రైతు వేదికలో బుధవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు నాగమణి, రమాదేవి ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో బాల్య ఆరంభ దశ, విద్యా అవశ్యకత విధానం అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సీడీపీఓ నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్లు సుజాత, గంగాజలం, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న కార్మికుడు రత్నం శివకుమార్ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య సమక్షంలో బుధవారం సీపీఐలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శివకుమార్‌కు ఆయన ఎర్ర కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రాంనర్సయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల బిక్షం, జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి అదెర్ల సురేందర్ పాల్గొన్నారు.

ఇలా అయితే వైద్యమెలా?

- 50 గ్రామాలకు ఒకే దవాఖానా, ఒకే డాక్టర్
- వేధిస్తున్న సిబ్బంది కొరత...
- అత్యవసరమైతే పట్టణాలకు పరుగులు



గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం..

గుండాల: మండల పరిధిలోని చుట్టుపక్క 50 గ్రామాలకు ఒకటే సర్కారు దవాఖానా. అందులో ఒకే ఒక్క వైద్యాధికారి. నలుగురు స్టాఫ్ నర్సులకు పని చేసేది ముగ్గురు. వారిలో ఇద్దరు డిప్యుటేషన్‌పై వచ్చిన వారే. ఇక మందులిచ్చే ఫార్మసిస్ట్ లేరు. అధికారులు నిర్వహించే సమావేశాలకైనా.. రిపోర్టు పంపాలన్నా.. మందులు ఆర్డర్ చేయాలన్నా.. రోగులకు ఇచ్చేదైనా వైద్యాధికారే. ఇక ప్రతీ రోజు ఓపీ చూసుకుంటూనే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి. ఆ ఒక్కరు సెలవుపై వెళ్తే వైద్యం డీలానే. అత్యవసర సమయాలలో పట్టణాలకు పరుగులు పెట్టాల్సిందే. గుండాల మండలంలోని పీహెచ్‌సీ పరిస్థితి ఇదీ. సీజనల్ వాధుల కాలం ప్రారంభం అవవుతున్న నేపథ్యంలో ఈ ఆస్పత్రి పరిధిలోని ఏజెన్సీ వాసుల ఆరోగ్యం కత్తిమీద సాములా మారింది.

సిబ్బంది కొరత.. రోగుల అవస్థలు

ఈ ఆస్పత్రిలో ఇద్దరు వైద్యాధికారులు ఉండగా రెండేళ్ల క్రితం ఓ వైద్యాధికారి ఉన్నత చదువులపై వెళ్లారు. నలుగురు స్టాఫ్ నర్సులకు ముగ్గురు మాత్రమే ఉన్నారు. అందులో ఇద్దరు డిప్యుటేషన్‌పై వచ్చారు. ఇక ఫార్మాసిస్టు అసలే లేరు. సాయనపల్లి సబ్‌సెంటర్ వద్ద ఏఎన్‌ఎమ్, గుండాల నందు సెకండ్ ఏఎన్‌ఎమ్ పోస్టులు ఖాళీ. ఆస్పత్రికి రోజుకు వంద మందికిపైగా రోగులు వస్తుంటారు. ఈ సిబ్బంది లేని కారణంగా రోగులు పడరాని పాట్లు పడుతుంటారు.

పట్టణాలకు పరుగులు..

ఈ పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న రోగులకు అత్యవసర సమయాలలో రిఫర్ చేస్తే పట్టణాలకు పరుగులు పెట్టాలి. ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షల్లో ఖర్చు పెట్టలేక మృత్యువాత పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే చిన్న ఎక్సరే తీయించుకునేందుకు పట్టణాలకు వెళ్లాల్సిందే. ఇక గర్భిణులు సైతం స్కానింగ్ కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిందే. చుట్టుపక్క గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి. ఎక్కువ కేసులు ఉన్న గ్రామాల్లో ఖచ్చితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి. సిబ్బంది సరిపడా లేక అన్ని రకాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పోస్టుమార్టం సెంటర్ ఎక్కడ?

పీహెచ్‌సీ పరిధిలో ఎవరైనా చనిపోతే ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు తరలించాలి. వెళ్లి రావాలంటే రూ. 10వేలు ఖర్చు భరించాల్సిందే. పోస్టుమార్టం సెంటర్ మంజూరి అయినా పనుల్లో జాప్యం ఏర్పడుతుంది.

30 పడకల ఆస్పత్రిగా మార్చాలి..

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా మార్చితేనే ఏజెన్సీ గ్రామాల్లో పూర్తి స్థాయిలో వైద్యం అందుతుందని మండల వాసులు కోరుతున్నారు. రెగ్యులర్ వైద్యాధికారులతో పాటు మహిళావైద్యాధికారి, వైద్య సిబ్బంది పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బెడ్లు సరిపోవడం లేదు. బెడ్లు పెరుగుతాయి. ఎక్సరే, స్కానింగ్ తదితర యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. ముప్పై పడకల ఆసుపత్రిగా మార్చితే ఏజెన్సీ గ్రామాల ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడదు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి, అవగాహన కల్పించాలి అనే ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసుపత్రి సమస్యలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సిబ్బంది సంఖ్యను పెంచాలి..



చిన్న అనారోగ్యానిక గురైనా ఆస్పత్రికి వస్తే ఒక్కడే డాక్టరు ఉంటారు. ఆయన పరీక్ష చేయాలి, ఆయనే మందు లియ్యాలే. ఎక్కువ జనం ఉంటే రోజంతా పడిగాపులే. ఆయన ఊరికెళ్లినా, మీటింగ్‌కు పోయినా ప్రైవేటు వైద్యమే దిక్కు.

– కొటెం రామలింగయ్య, కొడవటంచ

30 పడకలుగా మార్చితే మేలు



ఇప్పుడున్న పాలకులు, అధికారులు మా ఆస్పత్రిపై దృష్టిపెట్టి 30 పడకలుగా మార్చాలి. పోస్టుమార్టం సెంటర్ కూడా మంజూరు చేయాలి. అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి. ప్రైవేటులో లక్షలు డబ్బులు పెట్టలేం.

– పూనెం నర్సయ్య, ముత్తాపురం

సిబ్బంది కొరత వాస్తవమే..



ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత వాస్తవమే. ఇద్దరు ఉండాల్సిన ఆస్పత్రిలో నేకొక్కడినే ఉన్న. కొంత ఇబ్బందిగానే ఉంది. పోస్టుమార్టం సెంటర్ మంజూరి అయింది. 30 పడకల ఆస్పత్రిగా మార్చితే చాలా ఉపయోగాలుంటాయి.

– మనేష్‌రెడ్డి, వైద్యాధికారి

సీఎంఆర్‌ఎఫ్ పత్రాలు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ విభాగంలో దరఖాస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన దరఖాస్తు పత్రాలను అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాలకు చెందిన 150 మంది వివిధ అనారోగ్య సమస్యలు, ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న రోగులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తులు అందించారని తెలిపారు. ఆయా దరఖాస్తులను సీఎంఆర్‌ఎఫ్ విభాగం అధికారికి తానే స్వయంగా అందజేసినట్లు చెప్పారు. అనారోగ్యం, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధ పడే వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అదే విధంగా అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన రాయి పిచ్చమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధ పడుతూ, హైదరాబాద్‌లోని నిమ్స్‌లో వైద్యం కోసం ఆర్థిక ఇబ్బంది పడుతుండగా, ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి వైద్య సాయం కోసం రూ.2లక్షల 50వేల విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని అందించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వితరణ అందజేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుడు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. నాయకులు బైగాని రాము, కొప్పుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

అశ్వాపురం: యువత మత్తు, చెడు వ్యసనాలకు బానిస కావద్దని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో క్రీడా మైదానాన్ని సీఐ అశోక్‌రెడ్డి బుధవారం సందర్శించారు. యువతతో కలిసి క్రికెట్ ఆడి యువతలో ఉత్సాహాన్ని నింపి చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజలకు అవగాహన, చైతన్యం కలిగించాలను సూచించారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో బూర్గంపాడు వీధులలో చెత్తచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోందని తెలిపారు. డ్రైయినేజీలలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు నిలిచి రోడ్లపై పారుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

అశ్వాపురం: జిల్లా నూతన కలెక్టర్ జితేష్ పాటిల్‌ను కలెక్టరేట్‌లో ఏఐటీయూసీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ సమస్యలు వివరించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీఓకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు

గుండాల: ఆళ్లపల్లి మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న బత్తిన శ్రీనివాస్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆళ్లపల్లి ఎంపీడీఓగా పనిచేసిన రమాదేవి అనారోగ్య కారణాల వల్ల సెలవుపై వెల్లడంతో ఆ బాధ్యతలను ఎంపీఓకు అప్పగించారు. దీంతో బత్తిన శ్రీనివాస్ మండల పరిషత్ అధికారిగా బాధ్యతలను స్వీకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపాడు: సీజనల్ వ్యాధులు పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి అన్నారు. మోరంపల్లిబంజరలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రైయినేజీలలో పూడికలు తీయాలని, గుంతలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం దోమల నివారణకు యాంటీ లార్వా, ఫాగింగ్ చేపట్టాలన్నారు. గ్రామాల్లో తరుచు బ్లీచింగ్ చల్లించాలని, ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శి భవాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

అశ్వాపురం: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.రామారావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామారావు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో సుదూర ప్రాంతాల నుంచి వస్తూ పని చేస్తూ బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గుండాల: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో గత 13 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతల పక్రియను వెంటనే ప్రారంభించాలని శంభునిగూడెం ప్రధానోపాధ్యాయుడు రమేష్, బాలు డిమాండ్ చేశారు. బుధవారం ఏఏహెచ్ఎస్ శంభునిగూడెం పాఠశాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐటీడీఏ పాఠశాల ఉపాధ్యాయులను ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ, వారిని విస్మరిస్తున్నారని అన్నారు. బదిలీలు, పదోన్నతుల పక్రియ ప్రారంభించకపోతే స్వచ్ఛందంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రామయ్య, హరిలాల్, ప్రమోద్, వసంత, చిన్ని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులపై అవగాహన ర్యాలీ



బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ..

బూర్గంపాడు: నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యకర సమాజం సాకారమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి అన్నారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యవతి, సోమ్లా నాయక్, రవి, సడాలదేవి, మూర్తి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం అల్బెండజోల్ మందులు వేయించాలంటూ నినాదాలు చేస్తూ మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణకు ఒకటి నుంచి 19సంవత్సరాల లోపు పిల్లలందరికి తప్పనిసరిగా అల్బెండజోల్ టాబ్లెట్ వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో అర్హులైన వారందరికి అల్బెండజోల్ టాబ్లెట్‌లను వేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిషాంత్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియాపై అవగాహన



చర్లరూరల్: కొయ్యూరు పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీధర్



దుమ్ముగూడెం: విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం, కొయ్యూరు పీహెచ్‌సీలలో సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత)వ్యాధిపై వైద్యాధికారులు దివ్యనయన, శ్రీధర్‌లు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి పరీక్షలు ప్రారంభించారు. రక్త పరీక్ష చేసి సికెల్ సెల్ నిర్ధారణ చేసి అభాకార్డు ఇస్తామని, ఈ కార్డు వివాహానికి, బిడ్డలకు జన్మనిచ్చేందుకు సరైన నిర్ణయం తీసుకోడానికి తోడ్పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూజ, ఎంపీపీ కోదండ రామయ్య, డీపీఎంఓ సత్యనారాయణ, సీహెచ్‌ఓ రామలక్ష్మి, హెచ్‌ఈఓలు బాబూరావు, వేణు గోపాలకృష్ణ, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్స్ గోపి, కల్పన ఫార్మాసిస్ట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రతి ఒక్కరు రక్తహీనతపై అవగాహన పెంచుకుని వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి అన్నారు. సికిల్ సెల్ ఎనిమియా నివారణ దినోత్సవం సందర్భంగా మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సత్యవతి, బి.సోమ్లా, హెచ్‌ఈఓ రవి,హెచ్‌వీ సడాలదేవి,హెచ్‌ఎస్‌ఎమ్ మూర్తి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని రేగుబల్లి-1 ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బుధవారం డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ రేసు లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లు, బెడ్ షీట్లు, కార్‌పెట్లు, టవళ్లు అందజేశారు. కార్యక్రమంలో జీసీ డీఓ మంగతాయారు, హెచ్‌ఎం ధనసరి నాగమణి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: సికిల్‌సెల్ ఎనీమియా(రక్తహీనత) నిర్మూలనపై మండల వైద్యాధికారిణి ప్రియాంక అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ ప్రారంభించి, వ్యాధి లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎం ఆనంద్, సీహెచ్‌ఓ పూలమ్మ, పీహెచ్ ఎన్‌ఎస్టేర్‌రాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులంలో సికిల్ సెల్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యులు మణిదీప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ.. జన్యుపరమైన లోపాల వల్ల సికిల్ సెల్ ఎనిమీయా అను రక్తహీనత వ్యాధి సంక్రమిస్తుందని అన్నారు. గురువారం జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా, 1 నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు గల వారు తప్పకుండా అల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, ప్రిన్సిపాల్ జాను నాయక్, ఆసుపత్రి సూపర్వైజర్లు రామారావు, భద్రమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



హెడ్‌కానిస్టేబుల్ సూర్యంకు బహుమతి అందజేస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: నూతన చట్టాలపై పోలీస్ సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ పత్రికా ప్రటన విడుదల చేశారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు–2023 అమల్లోకి తేనున్నదని, పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై గడిచిన నాలుగు రోజులుగా భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలోని 35 మంది పోలీసులు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. నూతన చట్టాలపై టౌన్ ఎస్సై పీవీఎస్ రావు శిక్షణ అందించగా, శిక్షణ పొందిన వారికి నూతన చట్టాలపై పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని భద్రాచలం ఏఎస్పీ పంకజ్ బహుమతులతో అభినందించారు. కార్యక్రమంలో భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల పోలీసులు అధికారులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

లిఫ్ట్ పనులు ప్రారంభించాలి

దుమ్ముగూడెం: ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ నిధులు కేటాయించి పనుల ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యలమంచి సీతారామయ్య భవన్‌లో సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ మండల కార్యదర్శి కామ్రేడ్ కారం పుల్లయ్య అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్న ప్రగలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధుల కేటాయించడం లేదని అన్నారు. ప్రగలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తే సున్నం బట్టి నుంచి కొత్తపల్లి వరకు సుమారు 30 నుంచి 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, దానివల్ల రైతులు రెండు పంటలు పండించుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం సీపీఎం పోరాటం నిర్వహిస్తూనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచిలి వంశీ, మర్మం చంద్రయ్య, కోర్సా చిలకమ్మ, మండల నాయకులు యలమంచిలి శీను బాబు, కొడాలి లోకేష్ బాబు, బొల్లి సత్యనారాయణ, మర్మం సమ్మక్క, బేగ్, సోయం నాగమణి, వాగే ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

బూర్గంపాడు: లోవోల్టేజీ సమస్యలను అధిగమించేందుకు సారపాకలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. బుధవారం సారపాక గ్రామపంచాయతీలోని పలు ప్రాంతాలలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోవోల్టేజీ సమస్యలను అధిగమించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధుల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలు హాస్టళ్లలో బుధవారం దోమల మందు పిచికారీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని వైద్యసిబ్బంది సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్, వార్డెన్లు, వైద్య సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుమ తదితరులు పాల్గొన్నారు.


రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పార్టీ అధ్యక్షులు, నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఆస్పత్రిల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబంలో జన్మించిన రాహుల్ గాంధీ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఏకైక జాతీయ నాయకుడని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కరకగూడెంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



అశ్వారావుపేటరూరల్: జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో..